క్లుప్తంగా

మద్యం షాపులు మూసివేత



ఆకివీడులో మద్యం షాపునకు సీల్ వేసిన దృశ్యం

ఆకివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యం విక్రయాలు జరుగకుండా షాపులకు శనివారం సాయంత్రం నాలుగు గంటలకు సీలు వేసినట్లు ఎక్సైజ్ సీఐ రామారావు చెప్పారు. ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల్లోని 27 షాపులను ఈ సందర్భంగా మూసివేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు షాపులు తెరుస్తామన్నారు.

అలరిస్తున్న వసుధ ఎగ్జిబిషన్




భీమవరంలో వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లోని ఓ దుకాణం

సాక్షి, భీమవరం: పట్టణం ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లోని ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడే ప్రఖ్యాతి గాంచిన డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, మధ్యప్రదేశ్ వంటి నగరాల నుంచి ప్రముఖ డిజైనర్స్ తీసుకువచ్చిన లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేస్తున్నామని, ఈ నెల 12వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉండిలో ఎన్నికల చెక్‌పోస్టు

ఉండి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉండి సెంటర్‌లో పోలీసులు చెక్‌పోస్టును శనివారం ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. మద్యం, నగదు వంటివి తరలించకుండా ఉండి, ఏలూరుపాడు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఆకివీడు రూరల్ సీఐ గీతాకృష్ణ చెప్పారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.







ఇళ్ల నిర్మాణాలకు మరింత అనువుగా

- తాళ్లకోడు జగనన్న కాలనీలో ఊపందుకుంటున్న నిర్మాణాలు
- పేదలకు అందుబాటులో మెటీరియల్, సామగ్రి
- ఉత్సాహంగా ముందుకొస్తున్న లబ్ధిదారులు



ఇళ్ల నిర్మాణంలో పిల్లర్ల నిర్మాణానికి ఐరన్ బుట్టలు కట్టిన దృశ్యం



సిద్ధంగా ఉన్న అల్యూమినియం కిటికీ ఫ్రేమ్‌లు

ఆకివీడు: పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు మార్గం సుగమమైంది. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న కాలనీలో తక్కువ సొమ్ముతో పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ పనుల్ని వేగవంతం చేశారు. కాలనీలో 3,400 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో ఇప్పటికే 920 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేశారు. కొంత మంది గృహప్రవేశాలు కూడా జరిగాయి. మరో 500 మంది లబ్ధిదారులు అతి తక్కువ వ్యయంతో రూ.2.25 లక్షల వ్యయంతో ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ఐరన్‌తో పిల్లర్లు వేసేందుకు బుట్టలు సిద్ధం చేస్తున్నారు. సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రాన్ని కాలనీలో ఏర్పాటు చేశారు. సిమెంట్ గుమ్మాలతో పాటు అల్యూమినియం గుమ్మాలకు అవసరమైన ఫ్రేములు, కిటికీల ఫ్రేములను సిద్ధం చేశారు. పనులు వేగంగా జరిగేందుకు మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు.

రూ.2.25 లక్షలతో ఇళ్ల నిర్మాణం

ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న నిరుపేదలకు తక్కువ ధరకు ఇల్లు నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి రూ.2.25 లక్షలకు ఇల్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో లబ్ధిదారులు కేవలం రూ.45 వేలు సమకూర్చుకోవాల్సి ఉంది. డ్వాక్రా మహిళలైతే కేవలం రూ.15 వేలతో సొంత ఇంటి కల నెరవేరబోతుంది. తక్కువ ధరకు ఇల్లు నిర్మించేందుకు ఇప్పటికే 474 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చి అంగీకారం తెలిపారు. మరో 100 మందికి పైగా లబ్ధిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పథకంలో పునాదుల వరకూ పిల్లర్లు, బీము నిర్మాణం చేపడతారు. తరువాత ఇటుకలతో గోడలు నిర్మించి, ప్లింత్ బీము ఏర్పాటు చేసి, శ్లాబ్ నిర్మిస్తారు. ముందుభాగం ప్లాస్టింగ్ చేస్తారు. ఫ్లోరింగ్, లోపల, వెనుక భాగాల్లో ప్లాస్టింగ్‌ను లబ్ధిదారులు చేయించుకోవాల్సి ఉంటుంది.

దాతలు సహకరిస్తే..

దాతలు సహకరిస్తే అతి నిరుపేదలకు కూడా ఇల్లు ఏర్పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటు, డ్వాక్రా మహిళలకు ఇచ్చే రుణం రూ. 30 వేలు, మరో రూ.15 వేలు దాతలు సమకూర్చితే కాలనీలో మొత్తం లబ్ధిదారులకు ఇళ్లు ఏర్పడుతాయని పలువురు చెబుతున్నారు. రహదారులు, మురుగు కాల్వల గట్టున జీవించే కటిక పేదలకు దాతల సహకారం అవసరమని పలువురు సూచిస్తున్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ప్లేస్‌మెంట్స్ డే

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఢిల్లీ ఐఐటీ డీన్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఉద్యోగంలో చేరిన తరువాత ఆయా కంపెనీల అవసరాలకు అనుగుణంగా స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం అపారమైన ఉద్యోగావకాశాలున్నందున అకాడమిక్స్‌తోపాటు ఆధునిక అంశాలపై కూడా పట్టు సాధించాలన్నారు. మరొక అతిథి టీసీఎస్ రీజనల్ హెచ్ఆర్ పర్వీన్ అహ్మద్ మాట్లాడుతూ డిజిటల్ రంగంలో అపారమైన అవకాశాలున్నాయని, ప్రధానంగా కోడింగ్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలలోని సుమారు 1,000 మంది టీసీఎస్, కాగ్నిజెంట్, ఐబీఎమ్, టాటా పవర్, జిందాల్ స్టీల్ వర్క్స్ వంటి వివిధ కంపెనీల్లో పెద్దమొత్తం వేతనాలకు ఉద్యోగాలు దక్కించుకున్నారన్నారు. అనంతరం క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కళాశాల డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ డాక్టర్ కేఆర్ సత్యనారాయణ, గవర్నింగ్‌బాడీ సభ్యుడు ప్రతీక్‌వర్మ, వివిధ కంపెనీల ప్రతినిధులు ప్రసాద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వార్ వన్‌సైడే

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: భవిష్యత్‌లో ఎన్ని ఎన్నికలు జరిగినా వార్ వన్‌సైడేనని, వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగిస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ నియమించిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీలతో విజయం సాధించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఏర్పడిన పుష్కరకాలంగా ప్రజల వెన్నంటే ఉందన్నారు. పేదలు, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు అన్ని వర్గాల ప్రజల అండదండలతో ముందుకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్ మూడున్నరేళ్ల పరిపాలన ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగించిందన్నారు. దృఢమైన, సమర్థవంతమైన, నీతివంతమైన పరిపాలన అందజేస్తున్నారని చెప్పారు. పారదర్శక పరిపాలనకు వైఎస్ జగన్ దేశంలోనే ఉత్తమ సీఎంల స్థానంలో నిలిచారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రాడ్యుయేట్ల ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీకే వేస్తారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, స్థానిక సంస్థల బలోపేతం, గ్రామాల అభివృద్ధితో స్థానిక ప్రజాప్రతినిధుల ఓట్లు కూడా వైఎస్సార్‌సీపీకే పడతాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి వైఎస్సార్‌సీపీ చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఘన విజయం సాధిస్తారని ప్రజలే చెబుతున్నారని పీవీఎల్ అన్నారు. ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదేనని పీవీఎల్ ధీమా వ్యక్తం చేశారు.

వంద పడకలతో మరింత మెరుగైన వైద్యం

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



భీమవరంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదలకు అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందించడానికి పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. శనివారం ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడానికి ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తుండగా ప్రజలకు వైద్యాన్ని మరింత దగ్గర చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. ఈ హాస్పిటల్‌లో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, అంతేగాకుండా అత్యాధునిక వైద్య పరికరాలు కూడా సమకూర్చుకోడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆస్పత్రి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల సరిహద్దులో ఉన్న కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని గ్రామాల ప్రజలకు ఆసుపత్రి అందుబాటులో ఉంటుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,500లకు పైగానే వ్యాధులకు ఉచిత వైద్యాన్ని రాష్ట్రంలోని ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉచితంగా వైద్యం పొందే అవకాశం కల్పించారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పెద్ద మొత్తంలో ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోగా సీఎం వైఎస్ జగన్ చెల్లించిన విషయాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ గుర్తు చేశారు. భీమవరంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయితే పేద ప్రజలకు వైద్యం మరింత చేరువవుతుందని అందువల్ల వేగంగా పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నట్లు శ్రీనివాస్ చెప్పారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధిస్తాం



మహదేవపట్నం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం రవీంద్ర

ఉండి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తామని మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.రవీంద్ర అన్నారు. శనివారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల విజయంలో భాగస్వాములు కావాలన్నారు. వారి చదువును గమనిస్తూ ఉపాధ్యాయులతో మాట్లాడాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడ్డారో వాటిని గమనించి ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు. అలాగే పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడికి ఐదుగురు చొప్పున దత్తత ఇవ్వడం జరిగిందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, మోడల్ పేపర్లు రాయించడం, కొన్ని ప్రత్యేక ప్రశ్నలపై పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై శ్రద్ధ చూపాలి

పాలకోడేరు: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండాలని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో తల్లిదండ్రులు పిల్లలను దగ్గరుండి చదివించాలన్నారు. గతంలో జరిగిన పరీక్షల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు అనారోగ్యాలకు గురికాకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణ సాధించాలనే తపనతో 40 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. హెచ్‌ఎం పి.మహేష్, తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన

వీరవాసరం: రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన జరుగుతుందని పేరెంట్ కమిటీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ తెలిపారు. శనివారం పాఠశాలలో పేరెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీ, డీ గ్రేడుల్లో విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ఇంటి వద్ద కూడా పిల్లలు చదువుకునేందుకు తల్లిదండ్రులు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. డి.పుల్లారావు, అంగర వేణు, వి.శేఖర్, కె.భీమేశ్వరి, కె.వి.డి ప్రసాద్, గెద్దం మునలయ్య పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లోకి ఫోన్లను అనుమతించం

ఆకివీడు: ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకూడదని భీమవరం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. స్థానికంగా ఉన్న విద్యా వికాస్, కార్తికేయ జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష హాలులో బల్లల ఏర్పాటు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం తదితర వాటిని పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటును తనిఖీ చేశారు. పరీక్షా హాలు వద్ద మహిళా పోలీసులను ఏర్పాటు చేశామని ఆర్డీఓ చెప్పారు. హాలులోకి ఏ విధమైన వస్తువులు, సెల్‌ఫోన్లు, పుస్తకాలకు అనుమతులు లేవన్నారు. ముందుగానే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ఆర్డీఓ వెంట వీఆర్వో దానయ్య ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

ఉండి: వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ ఉండి మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.










చెరువు ఆక్రమణలు తొలగించాలని నిరసన

ఉండి: పాములపర్రు లో దళితవాడకు ఆనుకుని ఉన్న చెరువులో ఆక్రమణలు తొలగించాలంటూ దళితులు శనివారం గ్రామంలో నిరసన తెలిపారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ వారికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆక్రమణలు తొలగించి చెరువును వాడకంలోకి తీసుకురావాలని కోరారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ ఆర్డీవో దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లగా, ఈ నెల 17వ తేదీ అనంతరం సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ కేశన శాంతకుమారి మాట్లాడుతూ అధికారుల సహకారంతో సమస్య పరిష్కరించి చెరువును శుభ్రపరుస్తామన్నారు. దళిత సంఘ నాయకులు, పలువురు యువకులు, దానం విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు షేర్ మార్కెట్‌పై అవగాహన సదస్సు

మదనపల్లి: నాగసతీష్, వెల్త్ బిల్డర్స్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల అంశంపై ఆదివారం భీమవరం జేపీరోడ్‌లోని హోటల్ ఆనంద ఇన్‌లో ఉదయం 10, మధ్యాహ్నం 3, రాత్రి 7 గంటలకు ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ కృష్ణకైలాస్ చెప్పారు. షేర్ మార్కెట్‌లో ఎలా పెట్టుబడులు, పెట్టుబడి, లాభాలు అనే అంశాలపై వివరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 99666 10358 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అన్నసమారాధనకు విరాళం



విరాళం సొమ్ము అందజేస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులోని స్వయంభూః శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం అన్న సమారాధనకు గ్రామానికి చెందిన దాతలు పాదిలాపు నాగేశ్వరరావు కుమారుడు పాపారావు మధుసాయి, నాగలక్ష్మి దంపతులు రూ.50 వేల విరాళాన్ని శనివారం అందించారు. దేవస్థానం చైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, ఈఓ చాగంటి సురేష్ నాయుడు దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి వస్త్రంతో సత్కరించారు.

దూషించారంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తనను, తన భర్తను బెదిరించారని టి.శోభ అనే మహిళ ఫిర్యాదు చేశారని టూటౌన్ పోలీసులు శనివారం తెలిపారు. ఆక్వా సాగు నిమిత్తం నగదు ఇవ్వాల్సి ఉండడంతో కొందరు వ్యక్తులు వచ్చి దూషించారనే ఫిర్యాదుపై సీఐ బి.కృష్ణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్నకు ఊంజల్ సేవ

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెం రోడ్డులో శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం ఊంజల్ సేవ నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.


దళితవాడలను అధికారులు దత్తత తీసుకోవాలి

భీమవరం అర్బన్: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, దళితవాడలను అధికారులు దత్తత తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. జొన్నలగరువులో శనివారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొంది అత్యున్నత స్థానంలో దళిత ఉద్యోగులు ఈ దత్తత చేపట్టాలని కోరారు. అనంతరం సంఘ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కొయ్యే సంపతరావు, మండల కార్యదర్శిగా నల్లి వెంకటస్వామి, అధ్యక్షులుగా మద్దా రాజారత్నం మరికొంతమంది సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. బీర వెంకటరత్నం, విప్పర్తి వినయ్, బొడ్డుపల్లి యాకోబు, చెల్లి రాజ్ కుమార్, పిట్టా వినోద్, దాసరి చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

భీమవరం అర్బన్: భీమవరం రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ సాయి దుర్గాప్రసాద్ అన్నారు. వెంప జెడ్పీ హైస్కూల్లో రొటేరియన్ గొట్టుముక్కల రంగరాజు, భీమవరం రోటరీ క్లబ్ సహకారంతో 9, 10 తరగతి విద్యార్థినులకు శనివారం రూ.3 లక్షల విలువైన 42 సైకిళ్లను పంపిణీ చేశారు. సాయి దుర్గాప్రసాద్, భీమవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు గుదు కిషోర్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యనభ్యసిస్తేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. క్లబ్ డైరెక్టర్ షేక్ బాబాజీ సాహెబ్, హెచ్‌ఎం నడింపల్లి సూర్య భగవాన్‌రాజు, కె.అప్పలరాజు, క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్‌వీఆర్‌సీ జయవర్మ, గుండు గిరి, ఎస్ఎంసీ చైర్మన్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్యాంక్‌లో ఖాతాదారులకు కంటి పరీక్షలు



ఖాతాదారులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, భీమవరం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం మెయిన్ బ్రాంచ్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎండీ అలీమ్ నేతృత్వంలో సుమారు 60 మంది ఖాతాదారులకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

కాళ్ల: సీసలి గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గ్రామ పెద్దలు గణేశ్న బంగారయ్య చెప్పారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ సుమారు 250 ఏళ్ల క్రితం పోలేరమ్మ అమ్మవారు గ్రామంలో వెలిశారన్నారు. అమ్మవారు వెలిసిన ప్రాంతంలో గద్దె ఉండేదని, అది క్రమేపీ శిథిలావస్థకు చేరుకోవడంతో దీని అభివృద్ధికి మూడు కుటుంబీకుల వారు ముందుకు వచ్చారన్నారు. వీరిలో కొంతమంది విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావడం శుభపరిణామన్నారు.

అగ్నికుల క్షత్రియ సమావేశం విజయవంతం చేయాలి

భీమవరం అర్బన్: విజయవాడలోని ప్రెస్ క్లబ్ భవనంలో సోమవారం జరిగే అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ జాతీయ కార్యవర్గ సమావేశానికి అగ్నికుల క్షత్రియులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘ జాతీయ అధికార ప్రతినిధి కేఆర్‌కే వర్మ కోరారు. కొత్తపూసలమర్రులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి జాతీయ ప్రతినిధులు హాజరై సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలు, డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, భీమవరం: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కిలోల గంజాయిని సీఐ బి.కృష్ణకుమార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శనివారం చెప్పారు. బైపాస్ రోడ్డు కూడలిలో దుర్గాపురానికి చెందిన కె.సాయి, పశ్చిమబెంగాల్‌కు చెందిన సత్యామండల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు.